# నీంబూ పానీ

"మీ పెదనాన్నగారు మొన్న వచ్చినప్పుడు మరీ మరీ చెప్పారు కదా...ఓ సారి వెళ్లి చూసిరాకపోతే ఏం బాగుంటుందండీ" అంది శ్యామల.

"ఎవరి సంగతి నువ్వు చెప్పేది?" అన్నాడు భాస్కరం.

"రామనాథంగారండీ...అదేదో కంపెనీకి మేనేజింగ్ డైరక్టరుటగదా, పది రోజుల క్రితం ఆయన అనుకోకుండా మీ పెదనాన్న గారిని కలిసేరుట. మీరిక్కడ రెండు మూడేళ్ళ క్రితం నుంచీ ఉంటున్నారని విన్నప్పుడు ఆయనకు మీ పెద్దనాన్నగారి మీద బోలెడు కోపం వచ్చిందట. నేనొచ్చి ఏడాది కావొస్తోంది. మనవాడన్న వాడిక్కడే ఉంటూ ఇంతవరకూ ఒక్కసారైనా నన్ను కలుసుకోకుండా ఉంటాడా అని ఊ..ఇదైపోయారట..."

భాస్కరం ఇంక వినలేదు.. "సరేలే ...ఆఫీసు నుంచి వచ్చేక ఆలోచిద్దాం!" అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

ఈ సందర్భంలో భాస్కరం గురించీ అతని పెదనాన్నగారి గురించీ కొంతవరకూ చెప్పవలసి ఉంది.

సుబ్బయ్యగారు భాస్కరానికి వరసకు పెదనాన్న మాత్రమే అయినప్పటికీ..వాళ్ళ అను బంధం అంతకంటే చాలా ఎక్కువది. పిల్లలు లేని కారణంగా సుబ్బయ్యగారు చిన్నప్పట్నించీ భాస్కరాన్ని తన వద్దనే ఉంచుకుని విద్యాబుద్ధులు చెప్పించారు. సుబ్బయ్యగారి తమ్ముడు విశ్వానికి ఎనమండుగురు పిల్లలు. అందులో ఆరుగురు మగవాళ్ళు. భాస్కరం అయిదవవాడు. బహుశా అందువల్లనే ఏమో...భాస్కరం ఎక్కడ పెరిగినా అతని తలిదండ్రులకి అంత అభ్యంతరం లేకపోయింది. అదీకాక..ఏటా తరుచుగా అతను తల్లిదండ్రులను కలుస్తూనే ఉండేవాడు.

సుబ్బయ్య దంపతులు భాస్కరాన్ని అమితంగా అభిమానించారు. భాస్కరం బుద్ధిమంతుడు కాబట్టి సరిపోయింది కానీ వాళ్ళు చేసే గారాబానికి అతగాడు చెడిపోవలసిందే!

ఈ ప్రపంచంలో అభిమానాలకతీతమైనది ఒకటి ఉంది .అది డబ్బు. డబ్బు కారణంగా కొంతకాలం అనంతరం భాస్కరం తన పెంపుడు తల్లిదండ్రులను విడిచిపెట్టవలసి వచ్చింది. అనగా వారికి మనస్పర్థలు కలిగాయని కాదు. వారి ప్రేమానుబంధం ఎప్పటిలాగే ఉంది. కానీ పరిస్థితులు మాత్రం మారాయి.

చిన్నప్పట్నించీ భాస్కరం కష్టపడి చదువుకున్నాడు. ఉద్యోగం దృష్టి అప్పట్లో లేకపోయినా చదువు మీద అతనికి గల శ్రద్ధ కారణంగా ప్రతీ ఏటా ఉత్తమ శ్రేణిలో కృతార్థుడవుతూ వచ్చాడతను. అంతటితో ఆగక..యమ్మెస్సీ అనంతరం మూడేళ్ళ రీసెర్చి చేసి డాక్టరేట్ డిగ్రీ సంపాదించాడు. ఆ డిగ్రీ రావడమూ, వివాహం కావడమూ. ఉద్యోగం రావడమూ ఈ మూడూ అతి తక్కువ వ్యవధిలో జరిగిపోయాయి భాస్కరానికి. చాలా మంది అతన్ని అదృష్టవంతుడని అభినందించినా.. సుబ్బయ్యగారికి మాత్రం అతని ఈ అదృష్టం ఆనందాన్ని కలిగించలేకపోయింది. అందుక్కారణం అతని ఉద్యోగం దగ్గర ప్రాంతంలోకాక ఎక్కడో ఉన్న బొంబాయిలో రావడం.

మరి కొన్నాళ్ళాగితే దగ్గర్లోనే ఏదో ఉద్యోగం దొరక్కపోదనీ..బొంబాయి వెళ్ళవద్దనీ సుబ్బయ్యగారు భాస్కరానికి మరీ మరీ చెప్పి చూశారు. కానీ భాస్కరం వినలేదు. ఉద్యోగం దొరకడం ఈ రోజుల్లో అంత సులభంకాదనీ అందులోనూ ఆంధ్రలో డాక్టరేట్సుకి ఉద్యోగాలు దొరకడం మరీ కష్టమనీ అతను పెదనాన్నకు నచ్చజెప్పాడు. దూరం ఈ రోజుల్లో పెద్ద సమస్య కాదనీ, తరచుగా తను పెదతండ్రిని వచ్చి చూసి పోతూంటాననీ కూడా అతను హామీ ఇచ్చాడు.

ఇవికాక భాస్కరాన్ని వేధిస్తున్న సమస్య మరొకటుంది. ఇటు సుబ్బయ్యగారిది కానీ, అటు విశ్వంగారిది కానీ ఆర్థిక పరిస్థితి అంత గొప్పగా లేదు. ఉద్యోగం చేస్తే ఏదో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళన్నట్లుగా ఉంటుంది. తనకూ స్వతంత్రంగా ఉంటుంది. వివాహమయ్యేక మగవాడికి స్వయం సంపాదన ఎంతైనా అవసరం.

ఇష్టంగానో అయిష్టంగానో సుబ్బయ్యగారు తమ అంగీకారాన్ని తెలియబరిచేరు. భాస్కరం ఉద్యోగంలో జేరి కాపురం పెట్టడం కూడా జరిగింది. అతన్ని చూడడం కోసం సుబ్బయ్య దంపతులు కనీసం ఆరు నెలలకొకసారయినా బొంబాయి వచ్చి వెడుతుంటారు.

బొంబాయిలో వాతావరణం చూశాక సుబ్బయ్యగారికి కొన్ని కొత్త భయాలు పట్టుకున్నాయి. ఆ వాతావరణం ఆయనకు ఏ మాత్రం నచ్చలేదు. పల్లె జీవనానికి చిన్నతనం నుండీ అలవాటుపడ్డ ఆయనకక్కడి జీవితం దుర్భరంగా కనపడింది. ఏదో కొడుకును చూడాలన్న మోజు కొద్దీ అక్కడ ఎలాగో నాలుగు రోజులుండేవారు కానీ ఎప్పుడు పల్లెకు పోదామా అనిపించేది. ఇదివరలో చదువుకు కొడుకును పట్నం పంపించినప్పుడూ ఆయనకక్కడి వాతావరణం గిట్టలేదు. కానీ చదువై పోగానే కొడుకు ఇంటికి వచ్చేస్తాడుగదా అన్న ధైర్యం ఉండేది. ఇప్పుడు కొడుకు ఉద్యోగస్తుడు. కలకాలమూ ఇక్కడే ఉంటాడు.

పాలేమిటి, పెరుగేమిటి..ఆఖరికి మంచినీళ్ళు కూడా రుచిగా ఉండవిక్కడ. అక్కడికీ ఆయన వీలైనంతలో బియ్యం, పప్పులూ, నెయ్యి వగైరాలు ఇంటి దగ్గర్నుంచి కొడుక్కు అందజేస్తున్నాడు అప్పుడప్పుడు.

ఆహార సమస్య కంటే సుబ్బయగారిని..బొంబాయిలోని సాంఘిక సమస్యే ఎక్కువగా బాధించింది. అక్కడ ప్రజలకు ఇతరుల ప్రసక్తి లేదు. పక్కవాడు చస్తున్నా పట్టించుకోరు. సుబ్బయ్యగారి దృష్టిలో భాస్కరం, అతని భార్య శ్యామల కూడా పసివాళ్ళు. ఎలా బ్రతకాలో తెలయదని వాళ్ళు! పెద్ద దిక్కు చాలా అవసరమయిన వాళ్ళు. ఇటువంటి వాళ్ళను కాస్త కనిపెట్టి చూడడానికి..కనీసం ఎవరైనా స్నేహితులైనా - తెలుగు వాళ్ళూ, కావలసిన వాళ్ళూ, అయినప్పుడే కాస్త భాస్కరం మీద శ్రద్ధ చూపిస్తారు.

ఈ అభిప్రాయంతో సుబ్బయ్యగారు తన బంధువర్గంలో విషయ సేకరణ ప్రారంభించి..తమకు దూరపు లేక దగ్గర బంధువులైనవాళ్ళు బొంబాయిలో ఎంత మంది ఉన్నారో తెలుసుకోసాగారు. తెలుసుకున్నప్పుడల్లా భాస్కరానికి ఉత్తరం రాసి తెలియ పరుస్తూండే వారు. బొంబాయిలో ఫలానా చిరునామాగల వ్యక్తి అతనికి బాబాయ వుతాడనీ..తక్షణం వెళ్ళి కలుసుకోవాలసిందని ఒకసారీ, ఫలానా చోట భాస్కరం పినమామగారి మేనల్లుడున్నాడనీ అతన్ని కలుసుకోవలసిందని ఒకేసారీ - ఇలా ఆయన ప్రతి ఉత్తరంలో ఓ కొత్త వ్యక్తిని పరిచయం చేస్తూండేవారు. బొంబాయిలాంటి నగరంలో..ఊపిరి పీల్చడానికి కూడా మనిషికి కాళీ దొరకని ప్రదేశంలో తాపీగా బంధువులను కలుసుకోవడం సాధ్యపడదనీ.. వారానికి దొరికే ఒక్క సెలవునూ...అలాంటి పనులకు వృధా చేయడం తన కిష్టంలేదని భార్యకు చెప్పేవాడు భాస్కరం. అయితే పెదనాన్న బాధపడకుండా ఉండడం కోసం ఏదో కుంటిసాకు లేక అబద్ధమూ జోడించి.. జవాబు రాసేవాడు.

భర్త ఇలా చేయడం ఒక్కొక్కప్పుడు శ్యామలకే నచ్చేది కాదు. అందులోనూ ఆ చిరునామాలు సంపాదించడం కోసం సుబ్బయ్యగారు పడుతున్న పాట్లు ఊహించుకున్న కొద్దీ ఆమెకు జాలి కలుగుతూండేది. అయితే తీరుబడి చేసుకోవడమన్నది బొంబాయిలో ఎంత కష్టమో ఆమెకు తెలియంది కాదు. కానీ సుబ్బయ్యగారిచ్చిన చిరునామా వ్యక్తులు చాలా మంది గొప్ప గొప్ప హోదాల్లో ఉన్నారు. నగరంలో ఇంతో అంతో పలుకుబడి ఉన్నవారు.అటువంటి వాళ్లతో పరిచయం తమకూ మంచిదని స్త్రీ సహజమైన ధోరణిలో ఆమె ఆలోచించేది. అయితే దానికి భాస్కరం సమాధానం వేరే ధోరణిలో ఉండేది.

"తాడిచెట్టు క్రింద నిలబడి పాలు తాగినా లోకం కల్లుతాగుతున్నా మనే అనుకుంటుంది. మనకంటే ఎక్కువ హోదాలో ఉన్నవాడితో మనం కేవలం స్నేహాపేక్షతో పరిచయాన్ని అభిలషించినా..వారి అభిప్రాయం వేరేగా ఉంటుంది. వాళ్ళ నుంచి మనమేదో ఆశిస్తున్నామనీ వాళ్ళు మనకంటే అధికులమనీ అభిప్రాయపడుతూ అదే ధోరణిలో సంభాషణలు కొనసాగిస్తారు. ఆత్మాభిమానం కలవాళ్ళది సహించలేరు. మనమేమాత్రం వీలున్నా మనతో సమానమైన వాళ్ళతోనే స్నేహం చేయాలి. మనకంటే తక్కువ హోదాలో ఉన్నవారైతే వాళ్ళతో మనమే స్వయంగా స్నేహం చేయాలి. మనకంటే ఎక్కువ హోదాలో ఉన్నవాళ్ళు మన పరిచయాన్ని అభిలషించి స్వయంగా వస్తే కాదనకూడదు. ఇదీ నా అభిప్రాయం".

ఇలా ఎన్నోసార్లు జరిగిన అనంతరం ఇప్పుడీ రామనాథంగారి ప్రసక్తి వచ్చింది. రామనాథం సంగతి మరీ అంత కొట్టిపారేయాల్సిందికాదు. ఆయన భాస్కరానికి బాగా దూరపు చుట్టం. సుబ్బయ్యగారితో ఇంతో అంతో పూర్వ పరిచయం కలవాడు. పదేళ్ళుగా అమెరికాలోఉంటూ ఏడాది క్రితమే ఇండియాకు తిరిగివచ్చేడు. ఆ మధ్య సుబ్బయ్యగారిని గుర్తుపట్టడం..పాత విశేషాలు జ్ఞప్తికి తెచ్చుకోవడం జరిగేక మాటల సందర్భంలో భాస్కరం ప్రసక్తి వచ్చింది. భాస్కరం క్వాలిఫికేషనూ, చేస్తున్న ఉద్యోగం వివరాలూ అడిగి తెలుసుకుని ఆయన "నేను వచ్చి ఏడాదయింది.. ఒక్కసారైనా మనవాడు నన్ను కలుసుకోకపోవడం ఏం బాగాలేదు. బంధుత్వమంటే ఇదేనా?" అన్నాడట. "నువ్వు వచ్చినట్లు తెలియదు గదా..." అని సుబ్బయ్యగారు సర్దిచెబితే శాంతించేడట. ఈ విషయాలు సుబ్బయ్యగారు ఆ రోజే భాస్కరం చెవినేసి హితోపదేశం చేశారు. ఆయన సంతృప్తి కోసం భాస్కరం చిరునామా మాత్రం నోటుచేసుకున్నాడు. అదైపోయింది.

సుబ్బయగారు వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ కోడలికేం చెప్పాడో తెలియదుగానీ ఈసారి ఆమె గట్టి పట్టు పట్టింది. 'వాళ్ళు మనకి కావలసినవాళ్ళు ఎలాగో అలా ఒకసారి కలిసి తీరాలిసిందే' అంటూ.

"చూడు శ్యామలా..మనకు నెలకు వచ్చేది ఏదొందల రూపాయలు. ఆయన నెల జీతం మూడువేల పైచిలుకు. మన జీతంలో రెండొందలు మనముంటున్న ఈ ఇరుకు అద్దె కొంపకే పోతుంది. ఆయనకు కంపెనీవాళ్ళు ఫ్రీ క్వార్టర్సు - విశాలమైనవి ఇస్తారు. మనకు కనీసం స్కూటరైనా లేదు. ఆయన కార్లో తప్ప ప్రయాణం చేయడు. ఈ భేదాల వల్ల మనకూ వాళ్ళకూ మధ్య ఉన్న బంధుత్వపు విలువ నేతిబీరకాయలో నేయి వంటిది. ఆయన పెదనాన్నతో మాట్లాడిన మాటలంటావా..తన హోదా తన బంధువులకు తెలియజేయడమే ఆ పరిచయపు ప్రధానోద్దేశ్యం. మనని ఆయన మనస్ఫూర్తిగా ఆహ్వానించాడని నాకనిపించడంలేదు. నిజంగా బంధుప్రీతి కలవాడైతే.. పెదనాన్నను కూడా తీసుకుని కారులో మనింటికి రాకపోయే వాడా?"

"మీరా మనిషిని చూడలేదు. ఆ మనిషితో మాటాడలేదు. అప్పుడే ఆయన తత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ గురించి ఊహించేస్తున్నారు. ఎదుటివారిని గురించి ఒక నిర్ణయానికి రావడానికి ఎంతో కొంత పరిచయం అవసరం. నా అభిప్రాయం మీలో కొంచె ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుందని" అనేసింది శ్యామల.

భాస్కరం ముఖం కొంచెం ఎర్రబడింది. "ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుకి నేనేం తక్కువ హోదాలో లేనుగదా! ఎటొచ్చీ సుపీరియారిటీ కాంప్లెక్సు ఫీలయ్యేవాళ్ళను దూరంగా ఉంచాలని నా ఉద్దేశ్యం. ఇంక ఆయన ఆహ్వానం విషయమంటావా.. ఆ హోదాలో ఉన్న చాలా మంది ఎలా ప్రవర్తిస్తారో అనుభవపూర్వకంగా నాకు తెలుసు"

"ఇలాగని ఎంతమందినో తప్పించుకున్నారు. మీ అభిప్రాయం సరయినదో కాదో ఋజువుచేయడానికి ఓసారి రామనాథంగారింటి కెడదాం. అక్కడి అనుభవాన్ని బట్టి ఏ విషయమూ నిర్ణయిద్దాం" అంటూ అట్నించి నరుక్కువచ్చింది శ్యామల.

ఈ మలుపుకు భాస్కరం సిద్ధపడిలేడు. కాబట్టి 'సరే' ననవలసి వచ్చింది.

ఒక సెలవు రోజు చూసుకుని దంపతులిద్దరూ రామనాథంగారి అడ్రసు పట్టుకుని వెతుక్కుంటూ బయల్దేరారు. ఇల్లు సులువుగానే దొరికింది కానీ లోపలకు వెళ్లడం అంత సులువనిపించలేదు. ఇల్లు ఊహించిన కంటే పెద్దదిగా ఉంది. ఇంటి చుట్టూ ఆవరణలో నీటుగా పూలమొక్కలు పెంచారు. గేటు దగ్గర వాచ్‌మన్ ఉన్నాడు. అడగడమా, మానడమా అని దంపతులిద్దరూ కాసేపు తటపటాయించి.. చివరకు వాచ్‌మన్‌ని అడిగి అదే రామనాథంగారిల్లని తేల్చుకున్నారు. ఇద్దరూ డాబుగానే ఉండడంవల్ల వాచ్‌మన్ ఏమీ అభ్యంతరం పెట్టకుండానే లోపలకు వెళ్ళనిచ్చాడు. ఇంటి బయట ఆవరణలో పూలమొక్కల మధ్య నాలుగు గార్డెన్ చెయిర్స్ , టీపాయి ఉన్నాయి. అక్కడ ఒకతనుకూర్చుని ఉన్నాడు. వీళ్లను చూస్తూనే అతను లేచి హిందీలో పలకరించాడు. భాస్కరం అతన్ని హిందీలోనే రామనాథం గురించి అడిగాడు. రామనాథం కుటుంబంతో సహా ఏదో టూర్ వెళ్లాడనీ ఆరోజు రాత్రికి తిరిగి వస్తాడని అతను చెప్పి ఓ లెటర్‌ప్యాడ్ బాల్ పెన్నూ ఇచ్చి.''సాబ్‌కు మీరేదైనా చెప్పదల్చుకుంటే దీని మీద రాయండి!'' అన్నాడు. తనను సుబ్బయ్యగారి తమ్ముడి కొడుకుగా పరిచయం చేసుకుంటూ, తన చిరునామా యిచ్చాడు భాస్కరం. వచ్చేక ఓ సారి తమ ఇంటికి రావలసిందని ఆహ్వానిస్తూ, వీలునుబట్టి తను మరోసారి వస్తానని కూడా రాసేడు భాస్కరం.

అంతా అయిపోయి బయటకు వచ్చేక భాస్కరం,''వాళ్ళు లేకపోవడమే మంచిదయింది. ఉంటే ఏం మాట్లాడేవాళ్ళమో, ఏమిటో! నేనూహించినకంటే చాలా గొప్పవాడిలాగున్నాడీయన. ఆయన దగ్గర్నుంచి ఏదైనా రెస్పాన్సు ఉంటే తప్ప మనం మళ్ళీ ఇటురావద్దు..'' అన్నాడు భార్యతో. అతని గుండె వేగం అప్పుడప్పుడే తగ్గుతోంది. శ్యామలకు కూడా భాప్కరానికి కలిగిన అభిప్రాయాలే కలిగాయి. అందుకే అప్పటికి ఆమె ఇంకేమీ మాట్లాడలేదు.

రామనాథంగారి ఇంటి నుంచి బయటకు వచ్చేక భాస్కరానికి మళ్ళీ ఆ ఇంటికి వెళ్లాలనిపించింది. ఎందుకంటే ఆ ఇంటిలో అడుగిడుతూండగా అతనికి గుండెల్లో బెదురు ప్రారంభమైంది. రామనాథంతో మాట్లాడాలంటే ఎందుకో భయమనిపించింది. రామనాథం ఇంట్లో లేడని తెలియగానే అతనికి ఏదో బరువు దించుకున్న అనుభూతి కలిగింది. అనగా తనలో గొప్పవాళ్ళను కలుసుకోవడానికి ఏదో మూల పిరికితనం ఉందన్నమాట! నిజానికి రామనాథం తనకంటే ఏ మాత్రం గొప్పవాడు? తనేమీ తక్కువ చదువుకోలేదే? రామనాథం కంటే వయస్సులో పెద్దవాళ్ళను కూడా తను ధైర్యంగా పలకరించగలడు. దీన్నిబట్టి తను భయపడుతున్నది కేవలం ఆయన హోదాకి మాత్రమేనని అతనికి అర్థమైపోయింది.

ఈ నిజాన్ని గ్రహించగానే అతనికి పౌరుషం వచ్చింది. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ అవాంఛనీయ లక్షణం. దీన్ని పోగొట్టుకోవడానికైనా ఓసారి రామనాథంగారిని కలుసుకుని ధైర్యంగా పలకరించాలి. అయినా తను కేవలం స్నేహపూర్వకంగా ఆయన్ను కలుసుకోబోతున్నాడు కానీ మరో ఉద్దేశ్యంతో కాదుగదా...

అయితే వారం రోజులు గడిచినా రామనాథంగారి దగ్గర్నుంచి ఏ విధమైన సమాధానమూ రాకపోవడంతో భాస్కరం అభిమానం దెబ్బతింది. అప్పుడతను శ్యామలతో

అన్నాడు. "మనం ఏంజేస్తే అద్దంలో ప్రతిబింబం అదే చేస్తుంది. అలా చేయడంలో ఒక ఉద్దేశ్యమంటూ ఏమీ ఉండదు ప్రతిబింబానికి. నిజానికి ప్రతిబింబమన్నది ఒక భ్రమ మాత్రమే..దానికి ఉనికి లేదు! ప్రస్తుతం నాగరికత ప్రభావంగా..ఉనికి గల మానవుడు కూడా ప్రతిబింబంలా మసలుతున్నాడు. ఉదాహరణకు నువ్వు ఎవరి కాలైనా తొక్కితే "సారీ!" అంటావు. నీలో కాలు తొక్కేనన్న బాధ మాత్రం ఉండదు. తప్పు చేయగానే "సారీ" అనడం, సహాయం అందుకని "థాంక్స్" చెప్పడం ఇప్పటి అలవాటు. ఎవరైనా తెలిసిన వాళ్ళు కనిపించినప్పుడు..."మా ఇంటికోసారి రావాలి" అనడమూ, రాకపోతే నిష్ఠూరంగా మాట్టాడడమూ అలాంటి అలవాటులోని భాగాలే! ఆ ఆహ్వానంలో ఆప్యాయతగాని, ఆహ్వానాన్ని ఎదుటివాళ్ళు మన్నించాలనే కోరికగానీ ...మన్నించలేదనే బాధగానీ ఉండవు. నాగరికతకు ప్రతిబింబాలుగా జీవిస్తున్న మనుషులు చాలా మందున్నారు. రామనాధంగారు కూడా వాళ్ళలో ఒకరై ఉండవచ్చు."

అతని అభిప్రాయాలను శ్యామల అంగీకరించింది కానీ... రామనాథంగారిని అటువంటి వ్యక్తులలో చేర్చడానికి ఆమె అంగీకరించలేదు. "ఆయన దగ్గర్నుంచి మనకు సమాధానం రాలేదనే గదా మీ బాధ.. దాదర్ లో ఉన్న మనవాళ్ళను కలుసుకుందుకు మనం ఆరు నెల్ల నుంచి ఈ వేళ, రేపు అంటూ వాయిదా వేస్తున్నాం! అయిదు నెల్ల నించి ఇంటికి ఉత్తరం రాయలేదు. కారణం తీరుబడి లేదు! వాళ్ళకీ అంతేనేమోనని ఎందుకనుకోకూడదు? అందుకే మనమే మరోసారి వాళ్లింటికి వెడదాం..ఏ సంగతీ తేలిపోతుంది" అంది.

ఏదో విధంగా సమాధానపర్చుకుని భాస్కరానికి వాళ్లింటికి వెళ్లాలనే ఉంది. అందుకే అతను మనసు సమాధానపర్చుకుని శ్యామలతో అంగీకరించాడు. ఓ రోజు ఆఫీసు నించి కొంచెం పెందరాళే ఇంటికి వచ్చాడతను. ఆ సాయంత్రమే రామనాధంగారింటికి బయల్దేరారిద్దరూ. "గొప్పవాళ్ళు ఏదైనా ఫలహారం ఆఫర్ చేస్తే స్టయిల్‌గా కొద్దిగా మాత్రమే తిని మిగతాది వదిలేయాలి. కడుపులో ఆకలిగానే ఉంటే అలా చేయబుద్ధి వేయదు. కాబట్టి కడుపునిండా టిఫిన్ తినేసి మరీ బయల్దేరుదాం.." అన్నాడు భాస్కరం బయల్దేరే ముందు. అందుకే అలా చేసే బయల్దేరారు.

ఇద్దరూ ఇంటి ముందుకు రాగానే వాచ్‌మన్ వాళ్ళకు శాల్యూట్ చేసి గేటు తలుపు తీశాడు. వాళ్ళు లోపల అడుగుపెడుతూండగానే సుమారు నలభైఏళ్ళ పైబడ్డ ఒకాయన వాళ్ళకు ఎదురయ్యాడు. మనిషి పొట్టి లాగూ, బనియన్ తో ఉన్నాడు. చేతిలో టెన్నిస్ రాకెట్ ఉంది. వీళ్ళిద్దర్నీ చూసి ప్రశ్నార్థకంగా ఆగిపోయాడు.

భాస్కరం ఆయనకు తన పేరు చెప్పాడు. ఆయన హడావిడిలో ఉన్నట్లున్నాడు. తనకు కాస్త వెనుకగా ఉన్న ఒకావిణ్ణి చూపుడు వేలుతో సూచించి తను ముందుకు సాగిపోయాడు. ఈలోగా ఆపవిడ వారికి దగ్గరయింది.

భాస్కరం ఆమెను ఇంగ్లీషులో పలకరించాడు. ఆవిడ ఇంగ్లీషులో సమాధానం చెప్పింది. ఆవిడే శ్రీమతి రామనాథం. ఆవిడ తెలుగావిడ అవునో కాదో భాస్కరానికి అనుమానం కలిగింది. చూడ్డానికి భారతనారిలాగే ఉంది. తెలుగువారి ఆడపడుచులా కూడా లేకపోలేదుగానీ ఆ వాతావరణంలో తెలుగు మాట్లాడ్డానికి అతనికి భయంగానే

ఉంది.

మరి మాటలు లేకుండానే ఆవిడ వాళ్ళను కూర్చోమని చెప్పింది. కూర్చున్నాక ఓ రెండు నిముషాలపాటు వాళ్ళు ఒకళ్ళ మొఖాలొకళ్లు చూస్తూ కూర్చున్నారు. నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ రామనాథంగారిని గురించి అడిగాడు భాస్కరం. ఆయన ఇప్పుడే టెన్నిస్ ఆడడానికి వెళ్ళారన్నది శ్రీమతి రామనాథం. ఆ విషయాన్ని చూచాయగా ఊహించిన భాస్కరం తనకు సుబ్బయ్యతో గల బంధుత్వమూ, సుబ్బయ్య, రామనాథం గార్ల పరిచయమూ చెప్పగానే -

"ఐసీ...అయితే మీరు తెలుగువాళ్ళన్నమాట!" అందావిడ తెలుగులో.

అప్పట్నించి సంభాషణ తెలుగులో నడిచింది, కేవలం రామనాథంగారి ఆహ్వానం మీదనే తానిక్కడకు వచ్చినట్లు ఆవిడ గ్రహించేలా చేయడానికి భాస్కరం తంటాలు పడ్డాడు. సాధారణంగా తానెవ్వరింటికీ వెళ్ళడనీ..తన పెదనాన్న దెబ్బలాడడం వల్లనే వాళ్లింటికి వచ్చినట్లూ అతను చెప్పుకున్నాడు.

అతగాడి క్వాలిఫికేషనూ, ఉద్యోగమూ విన్నాక ఆవిడ స్వరంలో కొంచెం కొత్త గౌరవం తొంగి చూసింది. "చిన్న వయసులోనే పెద్ద చదువు చదివారంటూ..." అభినందించింది. ఆప్యాయత ఒలికే కంఠంతో శ్యామలను పలకరించింది. రామనాథంగారు వెళ్ళిపోయినందుకు నొచ్చుకుంది. ఆయనకు బంధువులంటే ప్రాణం. మీరు కావలసిన వాళ్ళని తెలిసుంటే ఆయన ఆగి ఉండేవారేమో" అంది. తనకు సుబ్బయ్య గారు కానీ మరెవరుకానీ తెలియరని కూడా అంది.

ఓ పావుగంటసేపు వాళ్ళ మధ్య రకరకాల చర్చలు జరిగాయి. ఆవిడ దేశంలో నిరుద్యోగ సమస్య గురించీ, ప్రస్తుతం క్షీణిస్తున్న ఎడ్యుకేషన్ స్టాండర్డ్స్ గురించీ, విద్యార్థులలో క్రమశిక్షణ గురించీ మాట్లాడింది. ఏ విషయం మాట్లాడినా ఆ విషయం గురించి తనకు క్షుణ్ణంగా తెలుసునన్న ధోరణిలో మాట్లాడింది.

కబుర్లు నడుస్తుండగానే ఆవిడ "ప్రసాద్!" అంటూ నౌకరును కాబోలు పిలిచింది. ఆ ప్రసాద్ రాగానే "కాఫీ లావో" అంది. ఆగమన్నట్లుగా ప్రసాద్‌కి సౌంజ్ఞ చేసి భాస్కరం ఆవిడతో అన్నాడు, "మీకుతెలియదు కాబట్టీ చెబుతున్నాను. మేమిద్దరం కాఫీ, టీ వగైరాలు తాగం. మీరుంటారో ఉండరో తెలియదు కాబట్టి కడుపు నిండా టిఫిన్ కూడా తిని వచ్చాం. దయుంచి మాకేమీ వద్దు.."

ఆవిడ అసంతృప్తిగా ముఖం పెట్టి..."ఏమీ తీసుకోకుండా వెళ్లడానికి వీల్లేదు. మా యింటికి వచ్చిన గుర్తుగా కనీసం నిమ్మరసమైనా పుచ్చుకోవాలి..." అంది.

భాస్కరం, శ్యామల ఏమీ అనలేకపోయారు.

"దో గ్లాస్ నీంబూ పానీ లావ్" అందావిడ. ప్రసాద్ వెళ్లిపోగానే.. "ఇప్పుడే మీరు వచ్చే ముందే టీ తీగాను. కంపెనీ కోసం కూడా ఏమీ తీసుకోలేను...." అంది భాస్కరంతో.

భాస్కరం ఏమీ అనలేదుకానీ నిమ్మరసం తాగడానికి అతనికిష్టంగా లేదు. అతనికీ శ్యామలకు కూడా కొంచెం జలుబుగా ఉంది. జలుబుగా ఉండగా నిమ్మరసం తీసుకోవడం అంత మంచిది కాదు. అయితే ఏమీ అనలేని పరిస్థితి.

ప్రసాద్ ట్రేలో రెండు గ్లాసులు తెచ్చి టీపాయ్ మీద పెట్టి "నీంబూ పానీ!" అని వెళ్ళిపోయాడు. "తీసుకోండి!" అందావిడ.

భాస్కరం, శ్యామల ఇద్దరూచెరో గ్లాసూ అందుకున్నారు. రుచి చూస్తుండగా ఇద్దరి కళ్ళలోనూ ఆశ్చర్యం స్పష్టంగా కనిపించింది. అది నిమ్మరసంలా లేదు. మామూలు మంచినీళ్ళలాగే ఉంది.

పానీయం సేవించడం అవగానే మరి వస్తామంటూ ఇద్దరూ లేచాడు. శ్రీమతి రామనాథం కూడా ఒకసారి మర్యాదకు "కాసేపు కూర్చొండి", అని తనూ లేచింది. గేటు దాకా వాళ్ళను సాగనంపుతూ.."మీరు తప్పకుండా మరోసారి రావాలి!" అంది.

"అనుకున్నకంటే చాలా బాగా మాట్లాడిందండీ ఆవిడ..." అంది శ్యామల. భాస్కరం నవ్వాడు. మళ్ళీ రావాలనిపిస్తోందా నీకు?"

శ్యామల ఒక్క క్షణం తటపటాయించి..."ఎందుకో చెప్పలేనుకానీ మరి రావాలని నాకు అనిపించడంలేదు..." అనేసింది.

భాస్కరం మళ్లీ నవ్వాడు.."ఎందుకో నేను చెప్పగలను. మన గురించి రామనాథంగారెదురు చూడడంలేదని తెలిసిపోయింది. నా పేరు ఆయనలో ఎలాంటి చలనం కలిగించలేదు. ఆయన మామూలుగా టెన్నిస్ ఆటకు వెళ్ళిపోయాడు. ఇక ఆవిడ ఆదరణలో ఆత్మీయత లేదు. బంధుత్వం పలుకులుకాక రాజకీయాలు మాట్లాడింది. నువ్వూ నేను కాక మరెవరు వెళ్లినా ఆవిడ అలాగే మాట్లాడుతుంది. అది వాళ్ళకు హోదా ఇచ్చిన సంస్కారం. మనను తనతో సమానంగా ఆవిడ భావించలేదనడానికి ఒక్కటే నిదర్శనం. కంపెనీకని ఆవిడ మనతోపాటు నీంబూ పానీ తాగలేదు. తాగితే ఏమయ్యేదో తెలుసా?"

శ్యామల కుతూహలంగా తన వంక చూడడం చూసి భాస్కరం... "నీంబూ పానీలో నిమ్మకాయ లేదనీ, అవి ఒట్టి మంచి నీళ్ళనీ తెలిసేది. అటువంటి శ్రద్ధ ఆవిడ ప్రత్యేక అతిథుల విషయంలోనేగానీ మనబోంట్ల విషయంలో తీసుకోదు. ఆవిడ చెప్పిన పద్ధతిని బట్టి నౌకరుకి కూడా మనం ఆవిడ దృష్టిలో ఏ స్థానంలో ఉన్నామో తెలిసి ఉంటుంది. అందుకే ధైర్యంగా మంచినీళ్ళను నీంబూ పానీ పేరుతో తెచ్చాడు. కానీ మనకది ఒక విధంగా ఉపకారం చేసింది. వాళ్ళకు మన పట్ల ఎంత ఆప్యాయత ఉందో తెలిసింది...."

"ఎలా?" అంది శ్యామల.

"ఆ నీంబూ పానీలో ఎంత నిమ్మరసం ఉందో వాళ్ల ప్రేమ పలుకుల్లోనూ అంతే ఆత్మీయత ఉందన్నమాట!' అన్నాడు భాస్కరం.

ఆ తర్వాతనించి ఏ సందర్భంలోనూ భాస్కరం నేతి బీరకాయ, పెరుగు తోటకూర అన్న పదాల్ని ఏ సామెతల్లోనూ ఉపయోగించలేదు. అనుభవాన్ని సామెతల్లో చెబుతారని తెలిసి అతనికి "నీంబూ పానీ" అన్నమాట ఆ స్థానంలో ఉపయోగిస్తే బాగుంటుందని తోచింది. ★

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక - 14.4.'72)*